క్రాంతి

వ్యాస సంపుటి

<u>**రచన**</u>

గౌరాబత్తిన కుమార్ బాబు



ముందు మాట

ఈ పొత్తములో మొత్తం పదహారు వ్యాసాలు ఉన్నాయి. ఇవి ఆగస్ట్,2018 నుండి నవంబర్,2019 మధ్య వివిధ సందర్భాలలో రాసినవి. 2018 ద్వితీయార్ధంలో నేను నడిపిన ఈ-పత్రిక పాంచజన్యం(అగ్గలిక) లో తొలి అయిదు వ్యాసాలు ప్రచురితమయ్యాయి. మిగతా వ్యాసాలు వివిధ సామాజిక మాధ్యమాలలో ప్రచురితమయ్యాయి. వీటిలో "శ్రద్ధ" అను ఒక ఆధ్యాత్మిక వ్యాసం కూడా చేర్చాను. ఇందులో పొందు పరచినవి నూటికి నూరుపాళ్ళు నా వ్యక్తిగత అభిప్రాయలు మాత్రమే.ఈ వ్యాసాలు పాఠకులకు ఇతోదికముగా ఆయా సామాజిక అంశాలను అర్ధం చేసుకోవడంలో ఉపయోగ పడగలవని ఆశిస్తున్నాను.

ఇట్లు,

గౌరాబత్తిన కుమార్ బాబు

FOR FREE CIRCULATION

ఆంధ్ర లో ప్రత్యాన్మాయ రాజకీయ వ్యవస్థ యొక్క ఆవశ్యకత

ఆంధ్ర లో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా, వై.యస్.ఆర్ కాంగ్రెస్ ప్రతిపక్షం లో ఉంది. గత ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికి మద్దతు ఇచ్చిన జనసేన , ఇప్పుడు వైరి పక్షం గా మారి వామపక్షాలతో జట్టు కట్టింది. వై.యస్.ఆర్ కాంగ్రెస్ లోపాయి కారీ గా బి.జె.పి తో అంటకాగుతుంది. కాంగ్రెస్ బి.జె.పి పైన ప్రజలకు ఉన్న వ్యతిరేకతను అసరాగా చేసుకోని కోల్పోయిన స్థానాన్ని దక్కించుకొవాలని ప్రయత్నిస్తుంది.

ఆంధ్రలో చంద్రబాబు తదనంతరం నాయకత్వ శున్యత ఏర్పడే ప్రమాదం ఉంది. కారణం చంద్రబాబు సమకాలీకుల్లోగానీ, తరువాతి తరంలో గానీ ఆ స్థాయి రాజకీయ చురుకుదనం ఉన్న నేతలు కొరవవడడం. అన్ని ప్రాంతీయ పార్టీ నాయకుల మాదిరి చంద్రబాబు కూడా వంశ పారంపర్య రాజకీయాలకు తెరదీశారు. తనయుడు లోకేశ్ ను వారసుని గా ముందుకు తెస్తున్నారు. మరి లోకేశ్ చంద్రబాబు స్థాయిలో పార్టీ ని నిలబెట్టగలరా?

వై.యస్.ఆర్ కాంగ్రెస్ అసలు ఏ సందర్భంగా అవతరించింది. వై.ఎస్.రాజశేఖర రెడ్డి అకాల మరణానంతరం జగన్ కు ముఖ్యమంత్రి పదవిని కాంగ్రెస్ అధిష్టానం నిరాకరించడంతో జగన్ వేరు కుంపటి పెట్టుకున్నారు. ఆ పార్టీ లక్ష్యం ఏంటీ అనేది తెలుపడానికి ఒక చక్కటి ఉదాహరణ –

నెల్లూరు జిల్లా వెంకటగిరి కి చెందిన నేదురుమల్లి రాంకుమర్ రెడ్డి ని బి.జె.పి రాష్ట్ర కార్యదర్సి ప్రకటించిన కొన్ని రోజులకే ఆయన వై.యస్.ఆర్ కాంగ్రెస్ లో చేరారు. చేరిక సందర్భంగా ఆయన జగన్ ముఖ్యమంత్రి అయ్యే వరకు కష్టపడి పని చేస్తానని అన్నారు. ఇది దేనికి తార్కాణం. ఆ పార్టీ లక్ష్యం ఏమిటి? ప్రజాసేవా లేక జగన్ ముఖ్యమంత్రి కావడమా? ఇలాంటి పార్టీలు దీర్గకాలం మన గలవా? ప్రజలకు ఉపయోగపడగలవా?

జనసేన పార్టీ ని స్థాపించిన నాలుగేళ్ళ తరువాత ఆ పార్టీ నాయకుడు పవన్ కళ్యాణ్ ఏడు సిద్ధాంతాలు, పన్నెండు హామీలు తో కూడిన జనసేన ఆశయ మరియు ప్రణాళిక పత్రాన్ని విడుదల చేసారు. అన్న చిరంజీవి 2009 లో ప్రజారాజ్యం అనే పార్టీ ని స్థాపించి 18% శాతం ఓట్లు సాధించి కూడా పార్టీ ని నిలబెట్టుకోక కేంద్రమంత్రి పదవికి మారకం చేసి కాంగ్రెస్ లో విలీనం చేశారు. జనసేన పార్టీకి ఇంకా క్షేత్ర స్థాయి నిర్మాణం లేదు. ఈ పార్టీ మరో ప్రజారాజ్యం అవుతుందా లేదా వ్యక్తి ఆధారిత పార్టీ గా కొంత కాలం మనుగడ సాగిస్తుందా లేదా బలమైన రాజకీయ వ్యవస్థ ను నిర్మిస్తుందా చూడాలి. ప్రస్తుతం పవన్ నడుపుతున్న రాజకీయాలు చూస్తే వ్యక్తి ఆధారంగా కొంతకాలం మనుగడ సాగించే అవకాశాలే ఎక్కువ.

వామపక్షాలు చాలా కాలం నుండి భావ సారూప్యత లేని పార్టీ లతో అంటకాగుతూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి. 21వ శతాబ్దపు మార్పులను అంది పుచ్చుకొని రాజకీయ సిద్ధాంత సవరణ చేసుకోవడం వామపక్ష పార్టీ లకు అత్యావశ్యకం.

ఆంధ్రలో ఆర్.ఎస్.ఎస్ భావజాలం అంతగాలేదు. కాబట్టి బి.జె.పి ఇక్కడ బలపడడం అంత సులభం కాదు. క్షేత్ర స్థాయి లో ఆ పార్టీకి అంత బలం కూడా లేదు. ఇక్కడ నుండి వెంకయ్యనాయుడు లాంటి నేతలు ఎదిగినా రాష్ట్ర స్థాయిలో ఆ పార్టీ ఏ మాత్రం బలపడలేదు.

కాంగ్రెస్ పార్టీని అంధ్ర ప్రజలు కష్టకాలం లో కూడా ఆదరించారు. అత్యవసర పరిస్థితి అనంతరం కూడా 42 లోక్ సభ సీట్లకు గాను 41 సీట్లు కట్టబెట్టారు. అటువంటి అంధ్రను అసంభద్ధ విభజన తో కష్టాలలోకి నెట్టింది ఆ పార్టీ. దాంతో 2014 ఎన్నికల్లో లో డిపాజిట్లు కూడా దక్క నీయకుండా చేసి ఆంధ్ర ప్రజలు శిక్షించారు. విభజన హామీలు నెరవేర్చకుండా బి.జె.పి ఆంధ్ర ప్రజల వ్యతిరేకతను మూట గట్టుకొని, కాంగ్రెస్ కు ఆంధ్ర లో మరో అవకాశాన్ని కల్పించింది.

కాంగ్రెస్ పార్టీ తాను మాత్రమే తెలుగు దేశం పార్టీ కి ప్రత్యామ్నాయం అని రుజువు చెసుకునే ప్రయత్నం చేస్తూ గతం లో మాదిరి దూర దృష్టి ఉన్న మంచి నాయకులను అందిస్తే , తమిళనాడు మాదిరిగా ఆంధ్రలో వ్యక్తి స్వామ్యం ఏర్పడి గందరగోళ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం తప్పుతుంది.

తేదీ: ఆగష్టు,2018 పాంచజన్యం తెలుగు ఈ-మాసపత్రిక ఒకటవ సంచిక లో ప్రచురితమైనది.

దేశం లో విద్యా వ్యవస్థ

ఈనాటి విద్యావ్యవస్థ గురించి చర్చించేముందు మన జాతీయ విద్యా విధానము ఏ విధంగా ధ్వంసం చేయబడినదో ముందుగా తెలుసు కోవాలి. ఈ విషయం తెలుసుకోవడానికి టంగుటూరి ప్రకాశం పంతులు గారు తన స్వీయ చరిత్ర లోని ప్రథమ ఖండం, ఐదవ అధ్యాయంలో ఇచ్చిన వివరణ చూడాలి:

'' ఆ కాలంలో రాజమహేంద్రవరంలో విద్యాసంస్థల్ని గురించి , విద్యా విధానాన్ని గురించి విపులంగా వ్రాస్తాను. ఉత్తరోత్తరా ఈ విద్యావిధానం మన జాతీయ విద్యావిధానమూ, దాన్ని ఇంగ్లిష్ స్కూల్లు వచ్చి ధ్వంసం చేసిన విధమూ, అందువల్ల మన జాతి ఆవిద్యలో మూలిగిపోవడమూ కూడా బాగా అవగాహన చేసుకోవాలి. ఈ నూతన విద్యావిధానానికి దాసుడైన నాబోటి వాడి వర్ణన ఆ విషయంలో మరీ సమంజసంగా ఉంటుందనుకుంటాను.

నేను నాయుడుపేట చేరేటప్పటికి దేశంలో ఇంగ్లిష్ చదువు ప్రారంభమయ్యి ఏ పది సంవత్సరాలో అయివుంటుంది. ఇంగ్లిష్ వాళ్ళు ఈ దేశం పూర్తిగా స్వాధీనం చేసుకున్న తరవాత ,"ఈ దేశంలో ఏ విద్యా పద్ధతి అమలులో పెట్టలా?" అని తర్కించారు. చివరకి మెకాలే సలహా మీద ఈ దేశంలో ఇంగ్లిష్ చదువు స్థాపించడానికి నిర్ణయించారు. ఆనాటి పాలకుల విద్యాదర్శం - ఆనాడన్న మాటేమిటి! ఈనాటి వరకూ కూడా అదే ఆదర్శం! – తమ పరిపాలనకి కావలసిన గుమస్తాలనీ, దుభాషీలని తయారు చెయ్యడమే! అందుకోసమనే వాళ్ళు ఆ పని పైనుంచి ప్రారంభించారు. ముందు కాలేజీలు స్థాపించారు. వాటికి శాఖలుగా హైస్కూల్స్ నడిపించారు. వాటికి ఉపశాఖలుగా ఇంగ్లిష్ ఆదర్శలతో నిండిన గ్రాంటుస్కూల్స్ స్థాపించారు. అంతకి పూర్వంవాటి స్థానంలో వుండే వీధి బళ్ళు ఎత్తివేశారు.

మన జాతీయమైన వీధి పాఠశాలల్లో నాలుగేళ్ళ పాటు చదువుకుంటే వ్రాతా,చదువూ రావడమే కాకుండా, భారత భాగవతాది గ్రంథ పఠనానికి పునాది పడడమూ , మంచి లౌకిక జ్ఞానం కలగడమూ కూడా జరిగేవి. ఈ గ్రాంటు బళ్ళు వచ్చి ఆ విధానం మార్చి వేశాయి. మాట వరసకి, మా నాయనగారు ఏ పెద్దబళ్ళలోనూ చదవలేదు. ఏ డిగ్రీలు సర్టిఫికేట్లు పొందలేదు. జీతం ఎనిమిది రూపాయలైనా, అప్పట్లో ఆయన ఆ చదువుతోటే ఎనిమిది ఊళ్ళపైన రెవెన్యూ అధికారం చేసి జీవనం చెయ్యగలిగారు. ఆ చదువు ఉపాధికి మార్గంగా ఉండేది. మా నాయన గారు చిన్ననాడు చదువుకున్న భారత భాగవతాలు నిరంతరం పారాయణం చేస్తూ, తమ ఆత్మోద్ధరణకి కృషి చేస్తూ ఉండేవారు. మా అమ్మమ్మగారు, పెద్దత్త గారు ఎక్కువ చదువుకోకపోయినా, భారత భాగవత రామాయణ కథలు యావత్తు కంటస్థంగా నేర్చుకుని మమ్మల్ని ఒళ్ళో కూర్చోపెట్టుకుని అవన్నీ ఉపదేశం చేసేవారు. ఆ విద్యా విధానపు ఆదర్శం జాతీయమైనది; విశాలమైనది. ఈ నూతన విద్యకి ఆదర్శం నౌకరీ, ధనసంపాదనా,స్వార్థమూనూ.

ఎప్పుడైతే మిడిల్ స్కూల్స్ చదువు పూర్తి చేసిన వాళ్ళు, మెట్రిక్యులేషన్ పాసైనవాళ్ళు కూడా పెద్ద,పెద్ద ఉద్యోగస్థులై అమితంగా ధన సంపాదనలో పడ్డారో, అప్పుడే దేశంలో విద్యాదర్శాలు క్షీణించాయి. ఆంగ్లేయ పాలకులు కూడా తమ రాజ్యానికి వేళ్ళు పారించడానికి మన దేశీయ సంస్థల నన్నిటినీ క్రమ క్రమంగా పెకిలించారు. ఆ రోజుల్లో పంచాయతీ పద్ధతిన న్యాయ నిర్ణయం చేసుకోవడం అమలులో ఉండేది. ఆ పద్ధతి తొలగించి కోర్టు ల పద్ధతి స్థాపించారు. దాంతో కానీ మన పతనం ప్రారంభంకాదు.ఆ కోర్టుకి జడ్జీలూ, వకీళ్ళు కావాలి గదా! అందుకోసం ముందుగా ఆంగ్లేయ పాలకులు మన

సంఘం లో ఉండే పెద్దల్ని ఏరి, వాళ్ళకి పెద్ద,పెద్ద పదవులు అంటగట్టారు.క్రమంగా కొంచెం చదువు – అంటే ఏ మిడిల్ స్కూల్ చదువో – చదువుకుంటే జిల్లా మునిసబీ అయ్యేది. అందుచేత వివేకవంతులనబడే వాళ్ళ దృష్టి అటు మళ్ళింది. జనం ఇంగ్లిష్ చదువులకి తియ్య నీటికి చేప లెక్కినట్లు ఎక్కారు. క్రమంగా మెట్రిక్యులేషన్ పాసయిన వాళ్ళ సంఖ్యా, ఎఫ్.ఏ ల సంఖ్యా,బి.ఏ ల సంఖ్యా పెరిగింది. దాంతో పాలకులు ప్లీడరీలకి , నౌకరీలకి అర్హతలు ఏర్పరిచారు. అప్పట్లో ఈ చదువుల్లోకి వెళ్ళిన వాళ్ళంతా ఉద్యోగస్థులై ధనార్జన బాగా చెయ్యడం వల్ల దేశస్థుల వ్యామోహం అటు తిరిగింది. అది: సుమారుగా ఆ కాలపు స్థితి.''

ఆనాడు కూడా ప్రభుత్వం ప్రైవేట్ హైస్కూల్స్ కి ఎన్నిటికో ప్రోత్సాహం ఇచ్చిందని పంతులు గారు రాశారు. ఈ విధంగా మనకు స్వాతంత్రం వచ్చే నాటికి కూడా విద్య మన దేశంలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల చేతుల్లో ఉండేది.

మొదటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో దేశీయ భాషల్లోనే బోధన జరిగింధి. ఆంగ్లేయులు దేశం విడిచి వెళ్ళి తరువాత కూడా దేశంలో ఆంగ్లం విరివిగా వాడబడుతూనేవుంది. దీనికి గల కారణాల్లో మొదటిది ద్రావిడ భాషలు మాట్లాడే రాష్ట్రాలు హిందీని జాతీయ భాషగా అంగీకరించలేదు.

భారతదేశం స్వాతంత్రం పొందిన తరువాత విద్య,వైద్యం మొదలైన అవసరాల కోసం ఎక్కువగా అమెరికా,ఇంగ్లాండ్ లాంటి దేశాలపై ఆధారపడింధి. కావున ఆంగ్ల భాష అవసరం బాగా ఏర్పడింధి. ఇంతలా ఆంగ్ల భాష అవసరం ఉన్నా ప్రభుత్వ పాఠశాలల్లో దేశీయ భాషల్లోనే విద్యా బోధన జరిగింది. మరో ప్రక్క ప్రైవేట్ రంగంలో ఆంగ్ల మధ్యమ పాఠశాలలకు విరివిగా అనుమతులు మంజూరు చేశారు. దీని వల్ల జనం ఆంగ్ల మద్యమం కోసం ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించడం మొదలుపెట్టారు.

సరళీకృత ఆర్థిక విధానాలు అనుసరించిన అనంతరం భారతదేశంలో విదేశీ పెట్టుబడులు బాగా పెరిగాయి. ప్రైవేట్ రంగం లో ఉపాధిఅవకాశాలు కూడా బాగా పెరిగాయి. దీని వలన ఆంగ్ల భాష ప్రాధాన్యత పెరిగింది. ఇంత అవసరం ఉన్నా ప్రభుత్వం మేలుకొని ప్రభుత్వ పాఠశాలల్ని ఆంగ్ల మాధ్యమంలోకి మార్చక పోవడం వల్ల ఎంతో చేటు జరిగింది. దీని వల్ల ప్రైవేట్ విద్యా సంస్థలు బాగా పెరిగి , ఇప్పుడు చదువు బాగా ఖరీదు అయిపోయింది.

ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమాలు పెట్టక పోవడానికి ప్రధాన కారణం దేశీయ భాషలు నిర్వీర్యమవుతాయని. ఇప్పుడు మాత్రం దేశీయ భాషలు కాపాడబడుతున్నాయా ప్రైవేట్ విద్యా సంస్థల్లో దేశీయ భాషల ప్రాధాన్యత కొరవడుతుంది. కాబట్టి ప్రభుత్వం తను నడిపే పాఠశాలల్ని ఆంగ్ల మధ్యమంలోకి మార్చి ప్రైవేట్ విద్యాసంస్థల్లో దేశీయ భాషను తప్పనిసరి చేయాలి. ఇది ఉభయ తారకంగా ఉంటుంధి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుంటే దేశంలో చదువు ఖరీదు తగ్గుతుంది, దేశీయ భాషలు కాపాడబడతాయి.

తేదీ: సెప్టెంబర్,2018 పాంచజన్యం తెలుగు ఈ-మాసపత్రిక రెండవ సంచిక లో ప్రచురితమైనది.

వామపక్ష తీవ్రవాదం

1967 లో చారు మజుందార్ నేతృత్వం లో బెంగాల్లోని నక్షల్బరీ గ్రామంలో మ్రోగిన ఎర్ర తుపాకీ ధ్వనులు నేటికీ రుధిర ధారలతో ధరణిని తడుపుతునే ఉన్నాయి. తెలుగుదేశం నాయకుడు మరియు అరకు యం.యల్.ఏ కిడారి సర్వేశ్వరరావు, మరో నాయకుడు సివేరి సోమ లను మావోయిస్టు పార్టీ హత్య గావించడంతో సద్దుమణిగాయి అనుకుంటున్న ఆ ధ్వనులు మళ్ళీ భీతి గొల్పుతున్నాయి. నా చిన్నతనం నుంచి ఈ వామపక్ష తీవ్రవాదం గురించి వింటున్నాను. బడిలో చదివేటప్పుడు అప్పటి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖామాత్యులు మాధవరెడ్డి గారిని హతమార్చడం, అటుతరువాత ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి మీదనే జరిపిన హత్యాయత్నం నాకు బాగా గుర్తు ఉన్నాయి. అప్పట్లో పీపుల్స్ వార్, జనశక్తి అనే నక్సల్ సంస్థలు రాష్ట్రం లో ఉండేవి. సామాన్య జనం అప్పటి నుండీ కూడా ఈ నక్సల్స్ దళాలను రాజ్యానికి వ్యతిరేకంగా హింస చేసే సంస్థల క్రింద చూసేవారు కానీ ఏనాడూ తమ కోసం పోరాడుతున్న విప్లవకారులుగా చూడలేదు. ఎదుగుతున్న క్రమంలో ఈ ఉద్యమం గురించి తెలుసుకునే ప్రయత్నం చేసిన నాకు ఉద్యమం లో అనేక వైరుధ్యాలు తారసపడ్డాయి. 1980,1990 దశకాల్లో ఆర్.ఓ.సి అనే పీపుల్స్ వార్ చీలిక సంస్థ పరిటాల రవి అనే తెలుగుదేశం నాయకునికి ప్రైవేటు సైన్యం గా వ్యవహరించి అతని శత్రువులను నిర్మూలించే క్రమంలో రక్తపుటేర్లు పారించింది. ఒకానొక సంధర్భంలో నేను సైతం నక్సల్స్ దేశభక్తులు అనుకునే వాడిని.కానీ సమసమాజం కోసం ప్రాకులాడే నక్సల్స్ నుండి నయీం అనే మాఫియా గ్యాంగ్ స్టర్ ఎలా ఉద్భవించాడో నాకు అర్థం కాలేదు. సామాన్య ప్రజానీకం ఉన్నతి కాంక్షించే నక్సల్స్ తమ పని తాము చేసే సామాన్యపోలీసు లను కూడా ప్రతీకార చర్యలతో ఎందుకు మట్టుపెడుతున్నారో ఈ రోజుకీ అంతుపట్టలేదు. చలనచిత్రాల్లో లంచగొండులను నిర్మూలించే 'భారతీయుడు'ను,'టాగూర్' ను చూశాను. నక్సల్స్ ఎందుకు ఇలా సాంఘిక సమస్యలపై తుపాకీ ఎక్కుపెట్టరు అని అనుకునేవాడిని. అమాయకప్రాణుల రక్తం మరిగిన ఉగ్రమూకల పై వీరెందు పంజా విసరరు. కనీసం నేటి యువతకు వారి ఆశయాలు ఏంటి అని తెలిపే ఉద్దేశం కూడా వారికి లేకపోయింది. నేటి సమాజం కులతత్వం, లంచగొండితనం, సామాజిక అభద్రత, కల్తీ, అసూయ, ద్వేషం లాంటి ఎన్నో సమస్యలతో సతమతమవుతుంది. అన్నిటికీ తుపాకీ తూటానే సమాధానమా?

కమ్యూనిస్ట్ పార్టీ విషయానికి వస్తే ఆ పార్టీ కాంగ్రెస్ భూస్వాములను దెబ్బకొట్టడానికి ఎంచుకున్న ఒక మార్గం సమాజం లో కొత్త తరహా ఫ్యాక్షనిస్టులను తయారు చేసింది. తమకు బలం లేని ప్రాంతాల్లో బలమైన స్థానిక వ్యక్తిని ఎంచుకుని వారికి మద్దతు ఇవ్వడం ఆ మార్గం. తరువాతి కాలంలో ఈ వ్యక్తులు కొత్త తరహా ఫ్యాక్షనిస్టులుగా మారారు. ఉదాహరణకు పులివెందులలో వై.యస్.రాజారెడ్డి. మరికొన్ని ప్రాంతాల్లో ఆ పార్టీ కార్యదర్శులే రౌడీలుగా మారారు. ఉదాహరణకు ప్రొద్దుటూరు లో యం.వి.రమణా రెడ్డి, విజయవాడ లో చలసాని వెంకటరత్నం.

ఇరవై ఒకటో శతాబ్దపు మార్పులు అందిపుచ్చుకోక కునారిల్లుతున్న వామపక్ష పార్టీల మాదిరే జనం నాడి పట్టుకోక ఈ మావోయిస్టులు కూడా విప్లవకారులుగా కాక అశాంతి కలుగజేసే దళాలు గా మారుతున్నారు అని మాత్రం మనకు అర్థం అవుతుంది.

తేదీ: సెప్టెంబర్,2018 పాంచజన్యం తెలుగు ఈ-మాసపత్రిక మూడవ సంచిక లో ప్రచురితమైనది.

సినీ రాజకీయం

తమిళ సూపర్ స్టార్ రజనికాంత్ తాను రాజకీయలోకి వస్తున్నట్లు ప్రకటించి రాబోయే ఎన్నికల్లో 234 స్థానాలలో పోటీ జేస్తామని ఇది వరకే చెప్పి యున్నారు. మరొక తమిళ అగ్ర నటుడు కమల హాసన్ పార్టీ కూడా స్థాపించారు. రజనీ రాజకీయాలు 1996 నుండి సాగుతున్నాయి. 1996 ఎన్నికల ముందు అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు గారిని మూపనార్,చిదంబరం లాంటి వారి ద్వారా కలసి కాంగ్రెస్ పార్టీలో చేరడానికి అత్యుత్సాహం చూపారని పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు తన "అసలేం జరిగిందంటే" అనే వ్యాసాలలో చెప్పారు. 1996 ఎన్నికల్లో రజనీకాంత్ డి.యం.కె కు మద్దతు ఇచ్చారు. 2004 ఎన్నికల్లో తాను బి.జె.పి కి ఓటు వేస్తానని బహిరంగంగా ప్రకటించి భంగ పడ్డారు. తమిళ నాడులో కరుణానిధి,జయలలిత శకాలు ముగిసిన అనంతరం 70వ పడి లో పడుతున్న తరుణంలో రాజకీయ ప్రవేశ ప్రకటన జేశారు రజనీకాంత్. ప్రకటనలోని విచిత్ర కోణం ఏమిటంటే "అధికారం లోకి వస్తే కొనసాగుతాము, లేనిచో వెనుదిరుగుతాము" అని చెప్పడము. అధికారం లేకపోతే రాజకీయాలు చేయని రాజకీయ పార్టీ లతో జనానికి ఏమి ఉపయోగం.

చిరంజీవి మొదలుకుని రజనీకాంత్, పవన్ కల్యాణ్ రాజకీయాలు చూస్తే వీరంతా యన్.టి.రామా రావు గారు పార్టీ పెట్టి 9 నెలలలో అధికారంలోకి రావడాన్ని ఆదర్శం గా తీసుకున్నట్లు కనబడుతుంది.

వీరంతా రాజకీయ ప్రవేశం చేసే మునుపు అంతకు ముందు రాజకీయాలలో విజయం సాధించిన యం.జి.ఆర్ రాజకీయ జీవితాన్ని సరిగ్గా విశ్లేషించుకోలేదు. అంత ఎందుకు యన్.టి.రామారావు గారి రాజకీయ ప్రవేశం గురించి కూడా సరిగా విశ్లేషించుకోలేదు.

రామారావు గారు అధికారంలోకి రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. అప్పుడు రాష్ట్రంలో ప్రత్యాన్మాయ రాజకీయ వ్యవస్థ లేకపోవడమే కారణం కాదు. అంతకు ముందు ఆంధ్రలో కాంగ్రెస్ కు వ్యతిరేకంగా వచ్చిన వచ్చిన ప్రకాశం పంతులుగారి ఆంధ్ర ప్రజా పార్టీ, యన్.జి.రంగా గారి స్వతంత్ర పార్టీ, పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి లాంటి వాళ్ళ నేతృత్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ , కాంగ్రెస్ అధికార పీటాన్ని కదిలించలేకపోయాయి. రామారావు గారు అధికారం లోకి రావడానికి కారణం ఆయన సినిమాలలో అగ్రనటుడు కావడం, ఆధిపత్య కమ్మ కులస్తుడు కావడం, సమాజం లో 50 శాతం ఉన్న వెనుకబడిన తరగతులను అక్కున చేర్చుకోవడం లాంటి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఇవేవీ పట్టించుకోకుండా రామారావు గారు పార్టీ పెట్టిన 9 నెలలలో అధికారంలోకి వచ్చారు, మేము కూడా అంతటి నటులము గాన మాకు కూడా అదే స్థాయిలో ఆదరణ లభిస్తుంది అనుకోవడం అవివేకం. యం.జి.ఆర్ 1977లో అధికారంలోకి వచ్చే నాటికే 24 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉన్నది. ఇప్పుడు రాజకీయాలు చేయాలనుకుంటున్న నటులు యం.జి.ఆర్ తరహాలో రాజకీయ పునాది వేసుకోవాలే గాని మేము రాగానే జనము మాకు అగ్ర పీటాన్ని అప్పగించాలన్న అతి ఆశ పనికి రాదు.

తేదీ: అక్టోబర్,2018 పాంచజన్యం తెలుగు ఈ-మాసపత్రిక నాలుగోవ సంచిక లో ప్రచురితమైనది.

<u>చీఫ్ మినిస్టర్ అఫ్ ఇండియా 'నరేంద్ర మోడీ'</u>

పైన రాసిన శీర్షిక పొరపాటున రాసింది కాదు.ఇది నరేంద్ర మోడీ గారి జీవిత చరిత్రకు సంబంధించిన వ్యాసం అంతకంటే కాదు.ఒక సగటు భారతీయుడి ఆలోచనాత్మక ఆవేదన.

2014లో 'మోడీ' మేనియాలో దేశం ఓలలాడి, నరేంద్రమోడీ గారికి ప్రజాస్వామ్య చక్రవర్తి పీఠాన్ని అందించింది. ఆ రోజున పెక్కు మంది దేశ ప్రజలు, మోడీ గారు దేశంలో నవ శకానికి నాంది పలుకుతారు అని భావించారు. ఆయన 'మేక్ ఇన్ ఇండియా' అన్నప్పుడు నాలాంటి వాళ్ళు దేశాన్ని సేవా రంగం నుండి తయారీ రంగం వైపు నడిపించబోతున్నారని అనుకున్నారు. ఆయన 'స్మార్ట్ సిటీస్' అన్నప్పుడు మెట్రో సిటీ లలో ఒత్తిడి మయమైన జీవితంతో విసిగి వేసారిన నాబోటి వాళ్ళు, ఇక ద్వితీయ శ్రేణి నగరాలు బంగారు మయమవుతాయని అనుకున్నారు. కానీ దేశానికి ఆనిడి సిద్ధించిన 70 సంవత్సరాల తరువాత 'స్వచ్ఛ భారత్' అని చీపురు పట్టి, ఫోటోలకు ఫోజులిచ్చి, ఎర్రకోట సాక్షిగా భారతీయుల దైన్యాన్ని జగతికి చాటారు.

భారతదేశం రాష్ట్రాల సమాఖ్య. అమెరికా సంయుక్త రాష్ట్రాల లాంటి సమాఖ్య కాదు భారతదేశం. దేశంలోని అనేక రాష్ట్రాలకు తమవైన భాషసంస్కృతి,చరిత్ర ఉన్నాయి. ఇటువంటి వైవిధ్యమైన దేశానికి నాయకత్వం వహించేవాడు భారతీయుడిని అనే భావంతో మెలగాలి కానీ, సంకుచితమైన భావజాలం పనికి రాదు. మోడీ ఒక భారతీయునిలా గాక, గుజరాతీగా వ్యవహరించడం దేశ దౌర్భాగ్యానికి ఒక చిన్న తార్కాణం.

మహాత్ముని 'సర్వోదయము'ను కాదని 'సామ్యవాద' విధానాలతో ముందుకు పోయి, సమసమాజాన్ని సాధించుకోలేక పోయి దివాళా అంచున నిల్చున్న తరుణంలో సరళీకృత ఆర్థిక విధానాలు అమలు జేసి నవశకంలోకి అడుగిడింది భారతం. కార్ల్ మార్క్స్ తన 'కమ్యూనిస్ట్ పార్టీ ప్రణాళిక' లో చెప్పిన విధంగా సరళీకృత ఆర్థిక విధానాలు గ్రామాలు , పట్టణాల మీద ఆధారపడే విధంగా చేసి, వ్యవసాయాన్ని, చేతి వృత్తులను సంక్షోభంలో పడ వేశాయి. 2014 నాటికి భారతదేశం, సరళీకృత ఆర్థిక విధానాల మొదటి పార్శ్వమైన సంపద సృష్టిని, రెండవ పార్శ్వమైన సంపద దుర్వినియోగాన్ని చవిచూసింది. మానవీయత, ధర్మ కర్తృత్వ దృష్టితో కూడిన మలి దశ ఆర్థిక సంస్కరణలు అమలు జరిపి భారతదేశాన్ని ఉన్నత దశకు తీసుకు వెళ్లి ఉండవలసిన మోడీ, చేసిందేమిటి?

దేశంలోని ప్రతి రాష్ట్రంలో బి.జె.పి పాలనే ఉండాలనే రాజకీయ లక్ష్యంతో పని చేశారు. నమ్మకమైన సంకీర్ణ మిత్రులను దూరం చేసుకున్నారు. ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురి చేయాలని సి.బి.ఐ,ఈ.డి,ఆదాయ పన్ను శాఖ వంటి రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేశారు. రాష్ట్రాల ఎన్నికల కోసం ఏ ప్రధాని కూడా పాల్గొననన్ని ప్రచార సభలలో మోడీ పాల్గొన్నారు. రిజర్వు బ్యాంకు గవర్నర్ కానీ, ఆర్థిక మంత్రి కానీ ప్రకటించవలసిన నోట్ల రద్దును అదేదో వీరోచితమైన , విప్లవాత్మకమైన చర్యగా భావించి ప్రధానమంత్రి గారే స్వయంగా ప్రకటించేశారు. ఆ నోట్ల రద్దుకు లక్ష్యం ఏమిటో దేశ ప్రజలకు సరిగా వివరించలేక భంగపడ్డారు. ఒకసారి నల్ల ధనాన్ని వెలికితీయడం కోసమని, మరొకసారి డిజిటల్ మనీని అమలులోకి తేవడం కోసమని చెప్పజూసారు. కానీ, ఫలితం అసంఘటిత రంగం కుదేలయింది.

అన్నిటికంటే విచారించవలసిన అంశం: రాష్ట్రాల సమాఖ్య అయిన భారతదేశంలో బి,జె.పి నేతలు, ఈ పథకానికి నిధులు కేంద్రం సమకూర్చింది, కేంద్ర పథకాలను వారి పథకాలుగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేసుకుంటున్నాయి అని వాదించడం. ఒకే ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం రెండూ నిధులు వెచ్చిస్తూ , ఈ పథకం మాది అంటే మాది అని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తగువులాడుకోవడం బహుశా మోడీగారు మాత్రమే సాధించిన ఘనత.

విశాల దృక్పథంతో ఆలోచించ వలసిన స్థానంలో ఉండి, సంకుచిత రాజకీయాలతో దేశంలోని అన్ని రాజ్యంగ వ్యవస్థలనూ దెబ్బతీసి, ప్రజాస్వామ్య నైతిక విలువలను కాలరాస్తున్న మోడీని భారతదేశానికి ముఖ్యమంత్రి అనడం సబబా? కాదా?

తేదీ: నవంబర్,2018 అగ్గలిక (పాంచజన్యం పునర్నామం) తెలుగు ఈ-మాసపత్రిక అయిదవ సంచిక లో ప్రచురితమైనది.

అవినీతికి పట్టం కట్టిన ఆంధ్రులు

ఆంధ్ర ప్రదేశ్ లో అవినీతికి పట్టం కట్టి దేశ వ్యాప్తంగా తమ (అప) కీర్తిని ఎలుగెత్తి నిలిపారు తెలుగు వారు. జరిగిందేదో జరిగిపోయింది అయిదు ఏళ్ళు రాష్ట్ర భవిత కోసం కష్ట పడ్డ చంద్రబాబుకు మనము ఇచ్చిన ఫలితం సరైనదేనా అని ఒక్కసారి జనం పునరాలోచించుకోవాలి. కర్ణుడి చావుకి కోటి కారణాలు అన్నట్లు, తెలుగుదేశం ఓటమికి కారణాలను ఒక్కసారి విశ్లేషించుకుంటే, చంద్రబాబు చేసిన పలు తప్పిదాలు కనపడతాయి.

1. రాష్ట్రం ఏర్పడ్డ తరువాత, ఓటు కు నోటు కేసు పడేంత వరకు అమరావతి మకాం మార్చకుండా తెలంగాణా రాజకీయాల్లో తలదూర్చడం,
2. కొడుకుకు ప్రజామోదం లేకుండా మంత్రి పదవి కట్టబెట్టడం,
3. 23 మంది వై.ఎస్.ఆర్.సి.పి ఎమ్మెల్యేలను ఫిరాయించి, తెలంగాణా ముఖ్యమంత్రి ఆడిన విషక్రీడను తానూ ఆడడం,
4. రెండవ శ్రేణి నాయకత్వం బలపడనీయక,అన్నీ తానై వ్యవహరించడం,
5. స్థానికంగా ఎమ్మెల్యేలకు, జన్మభూమి కమిటీలకు విపరీతమైన స్వేచ్ఛ ఇవ్వడం, తద్వారా జరిగిన అవినీతి. ఆ ఎమ్మెల్యేలకు మళ్ళీ అవకాశం ఇవ్వడం,
6. ఎవరొచ్చినా తినేదేలే అని ప్రజల్లో నాటుకున్న భావాన్ని మరింత బలపరచడం,
7. అమరావతి నిర్మాణంలో జాప్యం,
8. విపరీతమైన సంకీర్ణ రాజకీయం,బి.జె.పి తో తెగదెంపులు చేసుకున్న వెంబడే కాంగ్రెస్ తో అంటకాగడం.

పై తప్పిదాలకు ఈ స్థాయిలో శిక్షించడం అవసరమా? ఆయన ఎటువంటి ఫలితాలు సాధించలేదా అంటే , రాష్ట్రానికి శాయశక్తులా ఎంతో చేశారు.

1. లోటు బడ్జెట్లో ఉన్నా రైతు రుణమాఫీ అమలు
2. పింఛన్లు, అన్న క్యాంటీన్,పసుపు-కుంకుమ,వైద్య సేవ,అన్న దాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలు,
3. అనంతపురం మొదలుకుని నెల్లూరు వరకు జరిగిన పారిశ్రామిక అభివృద్ధి
4. పోలవరం ప్రాజెక్టును పరుగులుపెట్టించడం ,
5. పట్టిసీమ వంటి సాగునీటి ప్రాజెక్టులతో రాయలసీమకు నీరు అందించడం,
6. అమరావతిని మొదలుపెట్టి అంతర్జాతీయ స్థాయి రాజధాని నిర్మాణానికి పునాది వేయడం.

మన దేశంలో ఎక్కువమంది ప్రజలు, నేతల పనితీరు ఆధారంగా కాకుండా చరిస్మానో,సెంటిమెంట్ నో, కులాన్నో,మతాన్నో చూసి వోటు వేస్తారు. 1991లో పేదరికంలో ఉన్న దేశాన్ని ఒడ్డున పడేసిన పి.వి.నరసింహారావుకు మళ్ళీ అధికారం కట్టబెట్టివుంటే కాంగ్రెస్ పార్టీ నెహ్రూ కుటుంబ ప్రాబల్యంనుండి బయట పడేది. అదే ప్రజలు ఇందిరాగాంధి మరణానంతరం జరిగిన ఎన్నికల్లో సెంటిమెంట్ తో కాంగ్రెస్ కు 404 సీట్లు కట్టబెట్టారు.

జగన్ ఒక్క అవకాశం ఇద్దాము అనే వైఖరి, పోటీలో జనసేన ఉండి ఓట్లకు గండి కొట్టడం, జనంలో పెరుకపోయిన కులతత్వం,మతతత్వం, అవినీతి పట్ల అలసత్వం – తెలుగుదేశం ఓటమికి ప్రధాన కారణాలు.

మాకు సేవ రాజకీయాలు వద్దు,సమ్మోహన రాజకీయాలే ముద్దు అని 2009లో లోకసత్తా కు 1% ఓట్లు ఇచ్చినప్పుడే తెలుగుప్రజలు తెలియజేశారు.

2004 – 2009 మధ్య తండ్రి అధికారంలో ఉన్నప్పుడు మాదిరి కాకుండా , జగన్ మంచి రాజకీయం అందిస్తారు అని ఆశిద్దాం. ఇవ్వని పక్షంలో నేడు ఈ ఫలితానికి కారకులైన ప్రజలందరూ శిక్షార్హులు.

చంద్రబాబు ఓటమి నుండి తేరుకుని వారసత్వ రాజకీయాలకు తెరదించి, 2024 మళ్ళీ తెలుగుదేశాన్ని వికసింప జేయాలని ఆశిద్దాం.

తేదీ: మే,2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వ్రాసినది.

అంటరానితనం సమసి పోయిందా?

దశ కోటి పంచముల
దుర్దశకై కన్నీటి చుక్క రాల్పని పేల్పుల్
దశ లక్షలేల?పెన్నుని
దశావతారంబులేల? ధర్మములేల?

పది కోట్ల మంది పంచములున్నారు భారతదేశంబునానాడు. ఇంతమంది వ్యధాభరితులు, వర్ణసర్పదుష్టులు, దీనచరితులైన పంచములను రక్షించలేని మతధర్మాలు,ప్రభుత్వ చట్టాలు,దేవుడి అవతారాలెందుకు అని జాషువా కవి తన బాపూజీ పద్యాలలో ప్రశ్నించారు.

ఆయనావిధంగా ప్రశ్నించి దశాబ్దాలు గడచిపోయాయి, స్వాతంత్ర్యానంతరం పూజ్య బాపూజీ ఆశించిన విధంగా,అంబేద్కర్ ఆకాంక్షించిన విధంగా అంటరానితనాన్ని నిషేధించి,పంచములకు కోటాలు(రిజర్వేషన్స్) అమలు జరిపి వారి స్వావలంబనకు భారతదేశం ఎంతో కృషి చేసింది. కానీ ఇన్ని ఏళ్ల తరువాత కూడా విచారించవలసిన విషయం – అంటరానితనం నేరమైతే అయ్యింది కానీ వారికి తగిలించబడిన ట్యాగ్ అలానే కొనసాగుతుంది. అంటరానితనానికి మూల బీజమైన కులవ్యవస్థ 21వ శతాబ్దంలో బాగా బలపడి,దాని ఊడలు విస్తరించాయి. ప్రతి కులం వారూ తమ అస్థిత్వాన్ని నిలుపుకోవడానికి ఆరాటపడుతున్నారు. అంటరాని కులాలకు గాంధీజీ హరిజనులు అని పేరివ్వగా,ఇప్పుడు వారు ఎస్.సీ లని పిలవబడుతున్నారు. వారిలో కూడా అనేక కులాలున్నాయి. కుల వ్యవస్థకు ప్రథమ బాధితులైన హరిజనులు అంతా ఒక్క చత్రం కిందకు ఎందుకు రాకూడదు?వారి కోసం ఆ జన్మ పర్యంతం పాటుబడిన అంబేద్కర్ అవలంబించిన బౌద్ధ ధర్మాన్ని ఎందుకు ఆచరించకూడదు? ఎస్.సీ కులాల్లోని ప్రతి తరమూ కోటా(రిజర్వేషన్) సదుపాయాన్ని పొందడం ఎంత వరకు సమంజసం. చెప్పులు కుట్టుకునే వాడి బిడ్డడు కోటా(రిజర్వేషన్) పొంది ప్రభుత్వ అధికారి అయితే మళ్ళీ ఆ అధికారి కొడుకు కోటా(రిజర్వేషన్) పొందడం ఎంతవరకు సమంజసం. కోటా(రిజర్వేషన్) సదుపాయం కోసం ప్రతి తరమూ మేము అణగదొక్కబడిన వారమని చెప్పుకుంటూ పోతే , మరెప్పుడు అందరూ ఒకటయ్యేది.

జాషువా ప్రశ్నలకు సమాధానంగా మత ధర్మాన్ని సంస్కరించాము,చట్టాలు మార్చాం, అమలుజరిపాం. అయినా హరిజనులు ప్రధాన స్రవంతిలోకి మారకుండా అంటరానివారిగానే గుర్తింపు నిలుపుకుంటూ ఉండడం బాధాకరం. తాము అణచివేత నుండి పైకెదిగిన వారమని,అందరితో సమానమని వారు భావించినప్పుడు ఆ జాడ్యం పూర్తిగా సమసినట్లవుతుంది. స్వామి దయానంద సరస్వతి చూపిన బాటలో హరిజనులు ఒడుగు ద్వారా యజ్ఞోపవీతం ధరించి హరిహరులను సేవించాలి లేకపోతే అంబేద్కర్ సూచించిన బౌద్ధ ధర్మాన్ని అయినా అవలంబించాలి. అంతేకాని అన్యమత స్వీకరణ మంచిది కాదు. కారణం విదేశీ ధర్మాలు వారు స్వీకరించడం వల్ల కలిగిన విపరిణామం, వారు విదేశీయుల వలలో చిక్కుకోవడం.

పైన చెప్పింది ఒక పార్శ్వం మాత్రమే. సవర్ణ హిందువుల్లో కూడా కులం అనే మానసిక రుగ్మత తొలగాలి. అప్పుడే సమసమాజం సాధ్యపడుతుంది. అంబేద్కర్ చెప్పిన విధంగా కులం అనేది వర్ణాంతర వివాహాల మూలంగానో, సహపంక్తి భోజనాల వలనో తొలగదు,అది ఒక మానసిక రోగం. అందుకే ప్రతి భారతీయుడు ఈ మానసిక రుగ్మత నుండి బయట పడాలి.

తేదీ : రిజర్వేషన్స్ మరియు కులతత్వం పై ఏప్రియల్, 2019 లో వ్రాసినది.

భగత్ సింగ్ ని కాపాడటానికి గాంధీజీ ఏమి చేసారు?

మార్చ్23,1931న భగత్ సింగ్,సుఖదేవ్,రాజ్ గురు వంటి విప్లవకారులను నాటి ఆంగ్లేయ అడదడి ఉరి తీసింది. వారికి ఉరి శిక్ష తప్పించలేకపోయారని గాంధీజిని అనేకులు విమర్శించారు.ఉరిశిక్షలు అమలు తరువాత జరిగిన కరాచీ కాంగ్రెస్ సమావేశాల్లో గాంధీజీ ఎర్రజెండాల నిరసన ఎదుర్కొన్నారు.విమర్శకులు, గాంధీజీ ఆంగ్లేయ అడదడితో కుమ్మక్కు అయ్యి భగత్ సింగ్ ని ఉరికంబం ఎక్కించారని నింద మోపారు.

భగత్ సింగ్ ని కాపాడటానికి గాంధీజీ ఏమి చేసారు అని పరిశీలించే ముందు, అసలు హింసామార్గం పట్ల వారి అభిప్రాయం ఏంటి అనేది పరిశీలించాలి. గాంధీజీకి స్వరాజ్య సాధన మీదే కాక,దానికి అవలంబించాల్సిన పద్ధతి పట్ల కూడా గట్టి పట్టుదల ఉండేది. ఆ పద్ధతి కచ్చితంగా అహింసామార్గం అయ్యి ఉండాలి అన్న విషయంలో ఆయన ఎక్కడ రాజీ పడలేదు. గాంధీజీ అన్ని రకాల హింసా విధానాలను నిరసించారు. చట్టం అంగీకరించిన హింసా విధానాలను అంటే ఉరిశిక్ష మొదలైనవి కూడా గాంధీజీ నిరసించారు. హింసా మార్గం అవలంబించేవారి దేశభక్తి పట్ల గాంధీజీకి ఎటువంటి అనుమానం లేదు, కానీ అది వారి దృష్టిలో దారి తప్పిన దేశభక్తి. గాంధీజీ సాండర్స్ హత్యను ఖండించారు, అదే సమయంలో అటువంటి చర్యలకు విప్లవకారులను పురికొల్పినందుకు ఆంగ్లేయ అడదడిని కూడా విమర్శించారు. ఢిల్లీలో మార్చ్7,1931న జరిగిన ఒక సభలో మాట్లాడుతూ గాంధీజీ ఇలా అన్నారు:"ఎవ్వరిని కూడా ఉరికంబం ఎక్కించడం నా మనః స్సాక్షి ఒప్పుకోదు,మరీ ముఖ్యంగా భగత్ సింగ్ లాంటి వీరులను." మే 4 ,1930న గాంధీజీ,విప్లవకారులను విచారించడానికి ప్రత్యేక తగవరిని ఏర్పాటు చేయడాన్ని విమర్శిస్తూ వైస్రాయ్ కి లేఖ రాసారు. 11 ఫిబ్రవరి,1931న విప్లవకారులను కాపాడుట కొరకు ప్రివీకౌన్సిల్ కి అప్పీల్ కు వెళ్ళుటకై వేసిన స్పెషల్ లీవ్ పిటీషన్ తిరస్కరణకు గురయ్యింది. దాంతో వైస్రాయ్ క్షమాభిక్ష అవకాశం మటుకే మిగిలింది. అదే సమయంలో గాంధీ-ఇర్విన్ చర్చలు 17,ఫిబ్రవరి,1931న మొదలయ్యాయి. 18,ఫిబ్రవరి,1931న గాంధీజీ భగత్ సింగ్ గురించి వైస్రాయ్ వద్ద ప్రస్తావించారు.అప్పుడు గాంధీజీ భగత్ సింగ్ కి విధించిన ఉరిశిక్షను వాయిదా వేయవలసిందిగా వైస్రాయ్ ని కోరారు. ఇక్కడ గాంధీజీ ని ఉరిశిక్ష రద్దు కాకుండా వాయిదాను కోరడాన్ని చాలామంది విమర్శించారు.కానీ ఇక్కడ మనం గాంధీజీ రాజనీతిజ్ఞతను గుర్తించాలి. ఉరిశిక్షను వాయిదా వేయటం వల్ల లభించే సమయంలో విప్లవకారుల నుండి హింసామార్గం విడనాడే విషయంలో కచ్చితమైన హామీ తీసుకుని,ఆ హామీ ఆధారంగా ఆంగ్లేయ అడదడితో వారి విడుదలకు చర్చిద్దామన్నదే గాంధీజీ ఆలోచనగా చెబుతారు.

19 మార్చ్,1931న గాంధీజీ ఇర్విన్ ను రెండవ సారి కలిసినప్పుడు ,భగత్ సింగ్ గురించి మళ్ళీ ప్రస్తావించారు. అప్పుడు ఇర్విన్ గాంధీజీతో విప్లవకారులకు ఉరిశిక్షను తప్పించటం కానీ,వాయిదా వేయటం కానీ ఎట్టి పరిస్థితుల్లో తన మనఃస్సాక్షి అంగీకరించడంలేదని తెలిపారు. అప్పుడు గాంధీజీ చివరి ప్రయత్నంగా అసఫ్ ఆలీని(తదనంతర కాలంలో ఒరిస్సా గవర్నర్ గా పని చేసారు) విప్లవకారుల నుండి హింసను విడనాడే విషయంగా హామీ తీసుకోడానికి పంజాబ్ పంపారు. కానీ అసఫ్ అలీ యత్నం విఫలమయ్యింది. భగత్ సింగ్,సుఖదేవ్,రాజ్ గురూలు 20 మార్చ్, 1931న పంజాబ్ గవర్నర్ కి రాసిన లేఖలో కోర్ట్ తీర్పు ప్రకారం మేము యుద్ధం చేసాం.మేము యుద్ధ ఖైదీలం. కాబట్టి మేము ఉరి

వేయబడకుండా,కాల్చివేయబడాలని కోరుకుంటున్నాం అని తెలిపారు.తద్వారా మిగిలి ఉన్న చివరి అవకాశాన్ని మూసివేశారు.

ఇక్కడ జనం గమనించవలసిన ముఖ్యమైన మరో విషయం ఏంటంటే వైస్రాయ్ ఇర్విన్ భగత్ సింగ్ ఉరి విషయంలో చివరి వరకూ సందిగ్ధంగానే ఉన్నారు. గాంధీజీ ఇది గమనించి తుదికంటా పోరాడారు.లండన్ న్యూస్ క్రానికల్ కి చెందిన రాబర్ట్ బెర్నేస్స్ 21 మార్చ్,1931న తన డైరీ లో ఇలా రాసుకున్నారు: గాంధీజీ కరాచీ కాంగ్రెస్ కు వెళ్ళడం వైస్రాయ్ తో చర్చల నిమిత్తం ఒకరోజు వాయిదా వేసుకున్నారు.మార్చ్ 21న,22న రెండు సార్లు గాంధీజీ వైస్రాయ్ ని కలిసి భగత్ సింగ్ విషయమై చర్చించారు. గాంధీజీకి పరిశీలిస్తానని వైస్రాయ్ హామీ కూడా ఇచ్చారు.దీంతో కొంత ఆశ కలిగి,గాంధీజీ మార్చ్ 23న వైస్రాయ్ కి ఒక లేఖ రాసారు. ఆ లేఖలో వైస్రాయ్ ని ప్రియమైన మిత్రుడా అని సంభోదిస్తూ,దేశ అంతర్గత భద్రత,జనాభీష్టం,క్రైస్తవ సిద్ధాంతాల దృష్ట్యా ఉరిశిక్ష తప్పించవలసిందిగా కోరారు. కానీ అదే రోజు సాయింత్రం 7 గంటలకు భగత్ సింగ్,సుఖదేవ్,రాజ్ గురులను ఉరి తీసారు.విషయం తెలిసిన వెంటనే గాంధీజీ నైరాశ్యంలో మునిగిపోయారు.

భగత్ సింగ్ ప్రభుతుల ఉరితీత పంజాబ్ లోని ఆంగ్లేయ అధికారుల విజయంగా భావించాలి. ఒకానొక దశలో గాంధీజీ కోరికకు వైస్రాయ్ తలొగ్గారు. కానీ అప్పటి పంజాబ్ గవర్నర్ రాజీనామా చేస్తానని వైస్రాయ్ ని హెచ్చరించారు. అప్పటి ఫ్రీ ప్రెస్ టెలిగ్రామ్ లో పంజాబ్ లోని ఆంగ్లేయ అధికారులంతా భగత్ సింగ్ కు క్షమాభిక్ష పెట్టినట్లైతే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని వైస్రాయ్ ని హెచ్చరించిన విషయాన్ని ధృవీకరించింది. భగత్ సింగ్ ప్రభుతులు క్షమాభిక్ష తీసుకోవడానికి నిరాకరించడం గాంధీజీ పనిని మరింత కష్టతరం చేసింది.

గాంధీజీ విమర్శకులు గమనించవలసిన విషయం ఏంటంటే క్షమాభిక్షకు భగత్ సింగే వ్యతిరేకమని, ఆయన వీరమరణం పొందాలనుకున్నాడని. విప్లవకారులను దారి తప్పిన తన బిడ్డలుగా భావించిన బాపూజీ వారి విడుదులకు చేయవలసిందంతా చేశారు.

తేదీ : చందర్ పాల్ సింగ్ What Mahatma Gandhi did to save Bhagat Singh in www.mkgandhi.org ఆధారంగా **జూన్ 10,2019 లో వ్రాసినది.**

కలలోని ప్రసంగం

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 72 ఏళ్ళు కావొస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించాం, సేవా రంగంలో పురోభివృద్ధి ద్వారా ఆర్ధిక ప్రగతి సాధించాం. అయినప్పటికీ మానవాభివృద్ధి సూచీలో ఇంకా వెనుకబడే ఉన్నాం. 72 ఏళ్ల తరువాత కూడా ప్రాథమిక విద్య, కనీస వైద్యం జనాలకు ఉచితంగా అందించలేకున్నాం. ఈ ఏడు మహాత్మా గాంధీ 150వ జయంతోత్సవాలు జరుపుకోవడానికి యావత్తు భారతదేశం సమాయత్తమవుతుంది. వారు ప్రవచించిన గ్రామ స్వరాజ్యం కల గానే మిగిలిపోయింది. సర్వోదయాన్ని అందుకోలేకపోయాం. కార్ల్ మార్క్స్ కమ్యూనిస్ట్ పార్టీ ప్రణాళికలో చెప్పిన విధంగా పారిశ్రామీకరణ గ్రామాలు నగరాల మీద ఆదారపడే విధంగా చేసింది. వ్యవసాయం మీద కంటితుడుపు చర్యలకు మాత్రమే ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయి. అన్నదాతలకు ఘోరీలు కట్టబడుతున్నాయి. చేతి వృత్తులు పూర్తిగా నిర్వీర్యమవుతున్నాయి. భారీ పరిశ్రమలు,సేవారంగం,ఆకాశహర్మ్యాలతో కూడిన భారీ నగరాలే భారతదేశ ఆర్ధికవ్యవస్థకు పునాదులు అయ్యాయి. నగరాలలోని ఆర్ధిక వ్యవస్థతో పాటు సమాంతరంగా గ్రామీణ ఆర్ధిక వ్యవస్థ ఉన్నప్పుడే నిరుద్యోగం, జన జీవనంలోని అనిశ్చితి తొలగింపబడతాయి.

ముఖ్యమైన మరొక విషయం పర్యావరణ సమతుల్యత లోపించిన అభివృద్ధి. భారతదేశంలో సగటున ఒక మనిషికి 28 చెట్లు మాత్రమే మిగిలి వున్నాయి. ఉద్యమ ప్రాతిపదికన దేశంలో అటవీకరణ చేయకపోతే భావితరాలకు ప్రాణవాయువు లభ్యత సమస్య అవుతుంది. నదుల దిశలు మార్చే అభివృద్ధి ఎంత హాని చేస్తుందో దశాబ్దం క్రితమే భారతదేశం చూసింది. విద్యుత్ అవసరాలకోసం బొగ్గు ఆధారిత ఉత్పాదక కేంద్రాలు ఎక్కువచేస్తే దేశం బూడిద దిబ్బ అవుతుంది. కనుక పునరుత్పాదక విద్యుత్ కేంద్రాలను ప్రోత్సాహించాలి. నీటి నిల్వలు కూడా నానాటికీ అడుగంటుతున్నాయి. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ చెన్నపట్నమే, ఇంకుడు గుంటలు త్రవ్వడం,జనాభా సాంద్రత తగ్గించడం తక్షణ కర్తవ్యం.

2014లో దేశానికి నూతన నాయకత్వం వచ్చినప్పుడు మలి దశ ఆర్ధిక సంస్కరణలతో దేశం ముందుకు పోతుందని ఆశించాం. కానీ సంకుచిత రాజకీయాలకే ఆ నాయకత్వం ప్రాధాన్యమివ్వడం కడు శోచనీయం. లౌకిక వాదులమని చెప్పుకునే పార్టీల కుహనా లౌకిక వాదమే ఇట్టి పరిస్థితికి కారణం. దేశంలో అక్కడక్కడా కనపడే జాతీయ అతివాదాన్ని బూచిగా చూపిస్తూ పుడమి మొత్తాన్ని భయపెడుతున్న మత ఉగ్రవాదం పట్ల మాత్రం ఈ లౌకికవాదులు తగు రీతిలో స్పందించరు. నిరుడు జరిగిన ఎన్నికలు భారతదేశంలో ధనస్వామ్యం ఏ విధంగా నెలకొనింది అన్న దానికి చక్కని తార్కాణం. వ్యాపారులకు, రౌడీలకు మాత్రమే నేటి రాజకీయం వేదికవుతుంది. పౌరసమాజం నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలి. యువతలో అభ్యుదయ,విశాల భావాలు పాదుకొల్పాలి. దేశంలోనే అతిపెద్ద అవినీతి పరుడైన ఓటరు మహాశయుడు మారనిదే ఈ దేశంలో ప్రజాస్వామ్యం పరిడవిల్లదు.

తేదీ : జూన్ 26,2019 రాత్రి వచ్చిన కల లో నేనిచ్చిన ప్రసంగం.

<u>మహానాయకుడు మరియు తెలుగు జాతి గర్వించదగ్గ కళాకారుడు</u>

మహానాయకుడు మరియు తెలుగుజాతి గర్వించదగ్గ కళాకారుడు అయిన ఎన్.టి.రామరావు గురించి సామాజిక మాధ్యమంలో కొందరు చేసిన అనుచిత వ్యాఖ్యలకు చింతిస్తూ ఇలా మనవి చేసుకుంటున్నాను :-

కాంగ్రెస్ కి వ్యతిరేకంగా 1950 లో ప్రకాశం పంతులు గారి ఆంధ్ర ప్రజా పార్టీ,1967 లో రంగా గారి స్వతంత్ర పార్టీ ,1978 లో జలగం వెంగళరావు నాయకత్వం లోని రెడ్డి కాంగ్రెస్ లాంటివి వచ్చాయి. కానీ నెహ్రు-గాంధీ కుటుంబ నాయకత్వం లోని కాంగ్రెస్ ను గద్దె దింప లేక పోయారు.ఇవి కాకుండా పుచ్చల్లపల్లి సుందరయ్య , తరిమెల నాగి రెడ్డి లాంటి నాయకుల ఉన్న కమ్యూనిస్ట్ పార్టీ కాంగ్రెస్ అధికారాన్ని ఏమి చేయలేక పోయింది. పైన చెప్పిన వాళ్ళు అంతా కాకలు తీరిన రాజకీయ యోధులు.

రామారావు గారు తెలుగు వారికి ఒక గుర్తింపు,గౌరవం దక్కాలి అన్న ఉద్దేశం తో తెలుగు దేశం పార్టీ అనే వ్యవస్థను స్థాపించారు.రామారావు గారు అధికారం లోకి రావడానికి ఆయన ఇమేజ్, కష్టం, ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ లేకపోవడం, ఆయన ఆధిపత్య కమ్మ కులస్తుడు కావడం, రాజకీయాలలో ఒక తాజాదనం కనపడడం , ఇవి అన్ని కూడా కారణం.పరిపాలన లో ఆయన మంచి చేశారు, తప్పులు చేశారు. కోస్తా ప్రాంతం లోని కొన్ని వ్యతిరేక వర్గాలు రామారావు గారికి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయి.

రామారావు గారు చేసిన మంచి పనులు మనం మరచిపోకూడదు :-

౧. పటేల్ పట్వారివ్యవస్థ రద్దు

౨.మండల వ్యవస్థ

౩.బస్సు స్టాండుల అభివృధి

౪.తెలుగు గంగ ప్రాజెక్ట్

౫.ఆడవారికి ఆస్తి హక్కు

౬.వెనకబడిన తరగతులకు రిజర్వేషన్స్ మరియు రాజకీయ ప్రాతినిధ్యం

వంగవీటి రంగా హత్య విజయవాడ గ్రూప్ గొడవల్లో జరిగింది. దానికి రామారావు గారు నేరుగా బాధ్యులు అవ్వరు. రామారావు గారు ఒక కులానికి,ప్రాంతానికి చెందిన వ్యక్తి కాదు.తెలుగు జాతి గర్వంగా చెప్పుకోదగ్గ వ్యక్తుల్లో రామారావు గారు ఒకరు. కీర్తిశేషులు అయిన ఆయన పై ఫేస్బుక్ లో అనవసర పోస్టులు మంచిది కాదు.

ఇది ఒక సగటు ఆంధ్రుడి ఒక చిన్న విన్నపం.

సగటు ఆంధ్రుడి ఒక చిన్న విన్నపం -జూన్ 22,2018 న ఫేస్బుక్ లో ప్రచురించబడినది.

త్రిపిల్ తలాక్ బిల్లు

లోక్ సభలో 25 జూన్,2019న త్రిపిల్ తలాక్ బిల్లు ఆమోదం పొందింది. పార్లమెంట్ లో ఆంధ్ర రాజకీయ పార్టీలైన తెలుగుదేశం,వై.ఎస్.ఆర్.సి.పి ఈ బిల్లును వ్యతిరేకించాయి. త్రిపిల్ తలాక్ ద్వారా ముస్లిం భర్త తన భార్యకు విడాకులు ఇస్తే మూడేళ్ళ కారాగార శిక్ష విధించబడుతుంది. దీనిని ఇరు పార్టీలు వ్యతిరేకించాయి. ఎం.పి కేశినేని నానిగారు మాట్లాడుతూ మూడేళ్ళ కారాగార శిక్ష చాలా అన్యాయం. ముస్లిమేతరులు కూడా తమ భార్యలకు విడాకులు ఇస్తే ఇదే శిక్ష వర్తింపజేస్తారా? అని ప్రశ్నించారు. ఇక్కడ కేవలం త్రిపిల్ తలాక్ అనే ప్రక్రియ ద్వారా సత్వర విడాకులు ఇచ్చినప్పుడే శిక్ష వర్తిస్తుంది. చట్టపరంగా సాధారణ పద్ధతిని ఉపయోగించి విడాకులు కోరినప్పుడు ఈ శిక్ష వర్తించదు కదా! త్రిపిల్ తలాక్ అనే సాంఘిక దురాచారం రూపుమాపాలనుకున్నపుడు ఆ దురాచారాన్ని ఆచరించే వాళ్ళకు శిక్షను అమలుచేయడం అవసరం.లేనప్పుడు చట్టం యొక్క ప్రధాన ఉద్దేశమే వమ్ము అవుతుంది కదా!22 ముస్లిం దేశాలు కూడా ఈ దురాచారాన్ని నిషేధించాయి. ముస్లిం వనితల రక్షణకై ఉద్దేశించిన బిల్లును ఈ కారణం చేత వ్యతిరేకించడం కుహనా లౌకికవాదం క్రిందకు వస్తుంది. ఎం.పి గల్లా జయదేవ్ గారు మాట్లాడుతూ బిల్లు పక్షపాత వైఖరితో కూడి ఉంది, తలాక్ చెప్పకుండా భార్యను వదిలేస్తే ఏమి చేస్తారు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎం.పి గౌరవ్ గగోయ్ మాట్లాడుతూ సుప్రీమ్ కోర్ట్ త్రిపిల్ తలాక్ ను క్రిమినల్ కోడ్ కిందకు తీసుకురమ్మనలేదు.అప్పుడు మీరు భర్తలచే వదిలిపేయబడ్డ హిందూ,పార్సీ మహిళలను కూడా కాపాడాలి కదా అని వాక్రుచ్చారు. ఇక్కడ త్రిపిల్ తలాక్ అనే ప్రక్రియను మాత్రమే నిషేధిస్తున్నారు,అది మాత్రమే శిక్షార్హం, అందునా బెయిల్ అవకాశం ఉన్నది, అని వీరు గమనించకపోవడం శోచనీయం. మోడీ ప్రభుత్వ ఈ చర్య చాలా మంచి పరిణామం.

జూన్ 30,2019న రాజ్యసభలో కూడా త్రిపిల్ తలాక్ బిల్లు ఆమోదం పొందింది. తగినంత సంఖ్యా బలం లేకున్నా రాజకీయ చాణక్యంతో ఈ బిల్లును బి.జె.పి ఆమోదింపజేసుకుంది. మూజువాణి ఓటుతో అన్ని సవరణలు వీగిపోయి బిల్లు ఆమోదం పొందింది.2017 లో త్రిపిల్ తలాక్ పైన సుప్రీంకోర్టులో పిటీషన్ వేసిన సైరాబాను మరియు ఆరుగురు ఇతరులు ఈ పరిణామం పై హర్షం వ్యక్తం చేశారు.

అఖిల భారత ముస్లింపర్సనల్ లా బోర్డు రాష్ట్ర పతి ఆమోదం తరువాత బిల్లును సుప్రీమ్ కోర్టులో సవాల్ చేయడానికి సిద్ధం అవుతుంది.

ఒక దురాచారాన్నిరూపుమాపాలనుకున్నపుడు కఠిన శిక్షలు ఆ చట్టంలో పొందుపరచడం అవసరమన్న విషయాన్ని వీరు గుర్తించాలి.

హిందూ అనాగరిక పద్ధతులైన సతీ సహగమనం ,బాల్య వివాహాలు ,అంటరానితనం ఈ విధంగానే నిర్మూలింపబడ్డాయి.చట్టం దుర్వినియోగం కాకుండా అడ్డుకోవడం పోలీసుల మరియు కోర్టు ల విధ్యుక్త ధర్మం.

తేదీ : త్రిపిల్ తలాక్ బిల్లును పార్లమెంట్ ఆమోదించిన సందర్భంగా జులై,2019 లో వ్రాసినది.

<u>**తిలక్ సందర్శనం**</u>

'స్వరాజ్యం నా జన్మ హక్కు' అని నినదించిన బాల గంగాధర్ తిలక్ వర్ధంతి నేడు. ఆయన ఆగష్టు 1,1920 న బొంబాయి నగరంలో పరమపదించారు. ఆయన 'డెక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ','ఫెర్గూసన్ కాలేజీ' ల ద్వారా విద్యా వ్యాప్తికి విశేషంగా కృషి చేశారు. 'మరాటా','కేసరి' వంటి వార్త పత్రికల ద్వారా ఆంగ్లేయ అడదడిపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీలో 1890లో చేరి,పార్టీని మితవాదం నుండి సంపూర్ణ స్వరాజ్య సాధన వైపు నడిపించారు. 1908లో బెంగాల్ లో ప్రధాన మేజిస్ట్రేట్ డగ్లస్ పై బాంబు దాడి చేసిన విప్లవకారులను తన పత్రిక 'కేసరి'లో సమర్థించినందుకుగాను తిలక్ గారికి 6 సంవత్సరాల కారాగార శిక్ష విధించి బర్మా లోని మాండలే జైలుకు పంపించారు. జైలు జీవితం అనంతరం భారతదేశానికి తిరిగి వచ్చి ఆనీ బెసంట్ తో కలసి హోం రూల్ లీగ్ సంస్థను స్థాపించి స్వతంత్ర పోరాటం సాగించారు. ఆయనను ఆంగ్లేయులు "Father of Indian unrest' అని అన్నారు. సంపూర్ణ స్వరాజ్య పిపాసను భారతీయుల్లో రగిలించిన తిలక్ గారు నిజంగా ప్రాతఃస్మరనీయులు.రచయిత గా కూడా వారు భారత జాతీయవాదానికి ఎంతో తోడ్పడ్డారు. 'గీతా రహస్యం','The Arctic Home of Vedas','The Orion' వంటి ఉద్గ్రంథాలను రచించి భారతీయులకు మహోపకారం చేశారు.

ఇన్ని ప్రత్యేకతలు ఉన్నపటికీ ఆయన లోపరహితులు కాదు. అందుకే అయినపై నా ఈ ఏకీక కూడా మీరు చదవాలి:-



स्वराज हमारा जन्मसिद्ध अधिकार हैं, तुम्हारा नहीं


सन् 1871 में बिट्रीश संसद में प्रौढ़ मताधिकार का मामला उठा. बिट्रीश इंडिया में खतरे की घंटी बजने लगी. सन् 1918तक पिछड़ों के बुद्धिजीवियों में राजनैतिक महत्वकांक्षा का प्रादूर्भाव होने लगा और उनमें राजनीति में प्रवेश की चर्चा होने लगी थी. तब पंडित बालगंगाधर तिलक से रहा नहीं गया. उन्होंने अथनी(महाराष्ट्र) की एक जनसभा को संबोधित करते हुए अपने दिल की बात कह डाली,'मेरी समझ में नहीं आता कि ये तेली,तम्बोली और खाती कुनभट संसद में क्यों जाना चाहते हैं तेली क्या संसद में जाकर तेल बेचेगा तम्बोली क्या संसद मे जाकर कपड़ा सिलेगा और खाती कुनभट(कुर्मी या पाटीदार)क्या संसद में जाकर हल चलायेगा इसलिए कहो, स्वराज हमारा जन्मसिद्ध अधिकार है उनका नहीं,'

స్వాతంత్ర సాధన విషయంలో తిలక్ గారు అతివాది అయినా, సామాజిక అంశాల విషయంలో మటుకు ఆయిన సంకుచితమైన భావాలే కలిగి ఉండేవారు. టంగుటూరి ప్రకాశం పంతులు గారు తన ఆత్మకథలో తిలక్ గారిని కలిసినప్పటి విషయాలు నెమరు వేసుకుంటూ 'తిలక్' గారు పూర్వాచారపరాయణుడు అని అన్నారు. అంటరానితనం నిర్మూలన బిల్లుపై సంతకం చేయుటకు తిలక్ నిరాకరించారు. స్త్రీలకు విద్య,బాల్య వివాహాల నిర్మూలనపై కూడా తిలక్ గారికి వ్యతిరేక అభిప్రాయాలు ఉండేవి. అంతేకాక నిమ్నవర్గాలు రాజ్యాధికారం చేపట్టడంపై కూడా ఆయనకు సంకుచిత భావాలే ఉన్నాయి. అందుకు ఉదాహరణ ఈ దిగువ ఉపన్యాసమే :- "తేలి,తంబోలి,పాటిదార్ లు పార్లమెంట్లో ఏమి చేస్తారు?తేలి పార్లమెంట్లో తైలం అమ్ముతాడా?తంబోలి బట్టలు కుడతాడా?పాటిదార్ నేల దున్నుతాడా?"

గాంధీజీ కులాన్ని ఆమోదించినా,వారు అందరి ఉన్నతినీ కాంక్షించే సర్వోదయ వాది. అంటరానితనాన్ని నిర్మూలించడానికి ప్రబల ప్రయత్నం చేశారు. ఇట్టి భావజాలమే ఆయన సనాతన వాదుల ఆగ్రహానికి గురయ్యి హత్య గావించ బడడానికి కారణం. తిలక్ లాంటి సనాతన వాదుల ఆధ్వర్యంలో కాకుండా గాంధీజీ ఆధ్వర్యంలో మనకు స్వతంత్రం రావడం మటుకు మన అదృష్టమే. ఇన్ని వేల కులాలను,వందలాది భాషలను,అనేక ఉప జాతులను ఒక్క దేశం క్రింద కట్టి ఉంచడం జైపాల్ రెడ్డి గారు అన్నట్లు గాంధీజీ నైతిక,ఆధ్యాత్మిక ప్రయోగాల ఫలితంగానే జరిగింది అన్నది చరిత్ర తెలిసిన ఎవరూ కాదనలేని సత్యం.

తేదీ : లోకమాన్య తిలక్ జయంతి సందర్భంగా ఆగస్ట్ 1,2019 లో వ్రాసినది.

విద్యాభివర్ధని మాస పత్రిక


G. No. M 1429.

విద్యాభివర్ధని

VIDYABHI VARDHANI.

Venkatagiri Town (Nellore Dt.)

A TELUGU MONTHLY MAGAZINE

ON POPULAR EDUCATION

Editor and Proprietor—NEMALI. SUBBA RAO.

April 1922

ఏప్రిల్ నెల 1922.

4. 4.

పత్రికా రంగంలో నెల్లూరు పేరు చెబితే జాతీయోద్యమ కాలంనాటి "జమీన్ రైతు" పత్రికే గుర్తుకు వస్తుంది. స్వతంత్రోద్యమానికి ఉడుత సాయం చేసిన మరో పత్రిక కూడా సింహపురి గడ్డ పై నుండి వెలువడింది.

వెంకటగిరి సంస్థానం సాహిత్య పోషణలో కోస్తా ప్రాంతంలోని విజయనగరం,రాజమహేంద్రవరానికి ఏ మాత్రం తీసిపోదు. నాటి ఆంధ్ర దేశంలో విజయనగరం తరువాత పెద్ద సంస్థానమైన వెంకటగిరి సంస్థానం వారి సాయంతో నెమలి సుబ్బారావు అనే ఆంగ్ల ఉపాధ్యాయుడు " విద్యాభివర్ధని " అనే మాస పత్రికను 1919- 1922 కాలంలో నడిపారు.నెమలి సుబ్బారావు గారు 1915 ప్రాంతంలో వెంకటగిరి సంస్థానంలో పిల్లలకు ఇంగ్లీషు నేర్పించడానికి వెంకటగిరి వచ్చారు. సుబ్బారావు గారి స్వస్థలం చిత్తూరు జిల్లా వాయల్పాడు.నెమలి సుబ్బారావు గారు స్వాతంత్ర్యపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా , ఉద్యమానికి సహకారంగా “విద్యాభివర్ధని” మాసపత్రికను నాలుగైదేళ్లు నిర్వహించారు. ఈ పత్రిక మొదటి సంచిక 1919 జూలైలో మదనపల్లి నుండి విడుదలైయింది. వెంకటగిరి సంస్థానాధిపతి గోవిందకృష్ణయాచేంద్ర, ముద్దుకృష్ణయాచేంద్ర, జెట్ప్రోలు సంస్థానాధిపతి విద్యాభివర్ధని పోషకులు. **“అన్నదానత్పరంనాస్తి…యావజ్జీవంతు విద్యయా”**అనే సూక్తి పత్రిక పేరు క్రింద ముద్రించబడేది. మొదటి పది సంచికలు మదనపల్లె నుండి వెలువడగా, పదకొండోవ సంచిక నుండి వెంకటగిరి లో ముద్రింపబడింది.

కందుకూరి వీరేశలింగం గారు నడిపిన వివేకవర్ధని,సతి హితబోధిని సంఘసంస్కరణ కోసం నడుప బడగా, విద్యాభివర్ధని జాతీయోద్యమానికి ఉడతాభక్తిగా సాయం చేసింది. జమిందారీకి సంబంధించిన పత్రికే అయినా దేశభక్తిని ప్రచారం చేసింది.

ఏప్రిల్,1922 సంచికలో “దేశాభిమానం” శీర్షికన “దేవాంగ జ్యోతి” వారు వెలువరించిన పద్యములు జాతీయ భావాన్ని ఇనుమడింప జేస్తాయి. వాటిలో మచ్చుకకు కొన్ని :-

సీ .అన్య దేసములెల్ల హైన్యస్థితినుడంగ
మన దేశమౌన్నత్యమనువభించె,
పరదేశ జనులెల్ల బట్ట కట్టని నాడె
మనయార్యు లఖిలసంపదలగనిరి,
అలవిదేశాజులెల్ల రవివేకముననుండ
మన వారునుజ్ఞాన మహితులైరి,
లాతిదేశనులు నీతి నేర్వనినాడె
మనవారు సత్యసంపన్నులైరి.

గీ.దేశమఖిలేశ్వరుని స్వప్రకాశమరయ,
దేశాభాక్తియె యలజగదీశుభక్తి,
గాన దేశాభిమానంపు కలిమిలేని,
మానవుడు మానవుడె?యండు మ్రానుకాక.

విద్యాభివర్ధనిలో శ్రీ దర్భంగామహారాజ, వాల్మీకి, పరమహంస రామానంద తీర్థ మొదలైన వారి జీవిత చరిత్రలను కూడా వెలువరించారు.

1920లో కీర్తిశేషులైన శ్రీ బాలగంగాధర్ తిలక్ గురించి ఆగస్ట్,1920 సంచికలో వెంకటగిరి పట్టణంలోని ఆర్.వి.యం హై స్కూల్ హెడ్ మాస్టర్ గా పని చేసిన శ్రీ అల్లాడి జగన్నాధశాస్త్రి గారు "ఉత్పలమాలిక" శీర్షికన పద్య కవిత వెలువరించారు.

పై సంచికలోనే ఫుట్ బాల్ క్రీడ గురించి కూడా కథనం వెలువరించారు. ఫుట్ బాల్ క్రీడ యొక్క దేశీయ నామం "పాదకందుక క్రీడ" అని ఈ కథనం వల్ల తెలియవస్తుంది.

ఏప్రిల్,1922 సంచికలో మన వీధి బడుల వ్యవస్థ గురించి ఈ విధంగా వివరించారు:- " పూర్వ కాలమున వీధి బడులలో జదువు మన పిల్లలకు సుమతిశతకము,వేమన పద్యములు,దాశరధి శతకము,నృసింహ శతకము,భారత భాగవత రామాయణము నందలి నీతి కథలను బోధించుచుండిరి.అందువలన మన పిల్లలకు దైవ భక్తియు,మాతా పితృ భక్తియు,పెద్దలయందాదరణము,రాజ భక్తియు,గీర్తియం దాసక్తియు,మెండుగ నుండెను. ఈ కాలమున బడులయందు హిందూనీతి మత గ్రంథములను బోధించుట లేదు.ఇంటి యందు తల్లిదండ్రులైనను పిల్లలకు నీతిబోధములగు గ్రంథములను బోధించుటలేదు. గొప్ప పరీక్షల యందు గృతార్థులై ఏవిధమునైనను సంచులనిండా ధనమును సంపాదించు భ్రాంతిచే నీతిమత విషయముల ననాదరణ చేయుచున్నారు.ఇందువలన మన పిల్లలు నీతి బాహ్యములును గౌరవహీనములగు కార్యముల జేయుచు కులమునకు కుటుంబమునకు మఱియు దేశమునకంతయు నపకీర్తి దెచ్చుచున్నారు."

సుమారు వంద సంవత్సరాల క్రితం రాసిన పై మాటలు నేటి స్థితికి కూడా సరిపోతాయి కదా! టంగుటూరి ప్రకాశం పంతులు గారు తన తండ్రి గారి గురించి చెబుతూ, మా తండ్రి గారు ఏ పెద్ద బడిలోనూ చదువు కోలేదు , కేవలం వీధి బడి చదువుతోనే మూడు గ్రామాల మీద రెవిన్యూ అధికారం చెలాయించ గలిగేవారు అని చెప్పారు. పై రెండు మాటలు మన జాతీయ విద్యావిధానంలోని బలిష్టతను తెలియజేస్తాయి.

ఈ పత్రికలో ఉల్లి సాగు,చెరకు సాగు,మిరప సాగు మొదలైన వ్యవసాయ సంబంధ వార్తలు కూడా ప్రచురించేవారు.

మార్చ్,1920 సంచికలో దేశంలోని కొందరు నాయకులు ప్రచారం చేస్తున్న బ్రాహ్మణ ద్వేషాన్ని ఖండించారు. ఒక జాతి వారి నందరిని దూషించిన పాతకంబు గదా? అని. జనులయందు అంతఃకలహంబులు బెంచుట దేశోద్ధారకుల ధర్మము గాదు అని చెప్పారు.

సెమలి సుబ్బారావు గారు వాల్మీకి చరిత్రము,రావణ చరిత్రము, మహారాజా శ్రీ వెలుగోటి గోపాలకృష్ణ యాచేంద్ర బహద్దూర్ జీవితచరిత్రము అనే మూడు పొత్తములు వ్రాసినారు.

పత్రిక కొలది కాలమే నడచినా నాటి పత్రికా లోకంలో వెంకటగిరికి కూడా ఒక ముద్రను వేసింది.

(అక్టోబర్ 26, 2019 న ప్రతిలిపి పాఠకులకై వ్రాసినది)

ప్రాచీన భాషా హోదా ఒక అసంబద్ధ విధానం

ప్రాచీన భాషా హోదా కోసం మద్రాసు హై కోర్టులో సుదీర్ఘ పోరాటం తరువాత 2016లో తెలుగుకు హోదా లభించింది. కొందరు తమిళ భాషా దురభిమానులు వేసిన దావా అది. ఈ సగటు భారతీయుని ఆవేదన ఏంటంటే, నన్నయకు పూర్వం లిఖిత సాహిత్యం దొరకనంత మాత్రాన తెలుగుకు ఉన్న ప్రాచీనత లేకుండా పోతుందా?క్రీ.శ ఆరంభంలోనే తెలుగు శాతవాహన రాజు వాశిష్టి పులమావి నాణాల మీదకు ఎక్కింది. ఆంధ్రలోని ద్రావిడ దేశీయ భాష, సంస్కృతం,ప్రాకృత భాషలైన మహారాష్ట్రీ,పాళీల ప్రభావాన్ని తనలో జీర్ణించుకుని ,తెలుగు భాషగా రూపుదిద్దుకుంది. క్రీ.శ 6వ శతాబ్దం నాటికే తెలుగులో ఛందస్సు ఉండింది. వీటన్నిటినీ పరిగణించకుండా, అన్ని ద్రవిడ భాషలకు ఇప్పటి తమిళమే మూలం అన్నది వట్టి మూర్ఖ వాదన. ద్రవిడ భాషలకు మూలం ఆది ద్రవిడ భాష.

ఇప్పటి వరకు దక్షిణాదిన నాలుగు ప్రధాన భాషలకు ఆ హోదా లభించగా, ఉత్తరాదిన ఒడియాకు హోదా లభించింది.ఇప్పుడు మరాఠీకి కూడా ఆ హోదా అడుగుతున్నారు. ఇక్కడ ఈ సగటు భారతీయుని ఆక్షేపణ ఏంటంటే,ఏవో కొన్ని ప్రాతిపదికలు పెట్టుకుని ,ఫలానా భాష ప్రాచీనమైనదని తేల్చడానికి ఎవరికైనా ఏం అధికారం ఉంటుంది. ఏ భాష అయినా ఉన్నట్లుంది ఊడి పడదు కదా. ప్రస్తుత ఇండో ఆర్యన్ భాషలైన ఉత్తర భారత భాషలకు మూలం ప్రాకృత భాషలు. మరాఠీ,గుజరాతీ,కొంకణి,పంజాబీ లాంటి భాషలకు మహారాష్ట్రీ అనే ప్రాకృత భాష మాతృక కాగా, మాగధి అనే ప్రాకృత భాష నుండి ఒడియా,బెంగాలీ,భోజ్ పురి,అస్సామీ,మైథిలి లాంటి భాషలు వెలువడ్డాయి. అంటే ఆ భాషలకు పూర్వ రూపమున్నట్లేకదా. మరవి ఏ విధంగా ప్రాచీన హోదాకు అనర్హాలు.

సంగం సాహిత్యం నాటి తమిళానికి,ఇప్పటి తమిళానికి అంతరం లేదా?నన్నయకు పూర్వం శాసనాల్లో ఉన్న తెలుగుకు,ఇప్పటి తెలుగుకు ఎంత సామీప్యమున్నది? భాష అనేది ఒక నదీ ప్రవాహం లాంటిది.అలా సాగిపోతూ,చిన్న చిన్న పాయల్ని తనలో కలుపుకుంటూ, దిశలు మార్చుకుంటూ, మళ్ళీ కొన్ని పాయలుగా చీలుతూ సాగిపోతూ ఉంటుంది.ప్రాకృత భాషలు అలా ప్రవహించీ,ప్రవహించి ఇప్పటి ఇండో - ఆర్యన్ భాషలుగా రూపాంతరం చెందాయి.

భారత దేశం అనేక భాషలతో దీపిస్తున్న దేశం.దక్షిణాదిన మిగతా ద్రవిడ భాషలతో పోలిస్తే తమిళానికి ఉన్న ప్రత్యేకతలు ఏంటంటే : మిగతా ద్రవిడ భాషలలో లేని ప్రాచీన లిఖిత సాహిత్యం కలిగి ఉండటం,తక్కువగా సంస్కృత పదాలను చేర్చుకుని మూల రూపాన్ని ఎక్కువగా పదిల పరచుకోవడం.ఇంత మటుకు వారు గర్వించవచ్చు. కానీ,తమదే ప్రాచీన భాష అన్న అహంభావం కూడదు. ఏ భాష ప్రత్యేకత దానిదే.మానవ నాగరికతకు ప్రథమ సోపానం భాషయే.ఇచ్చిపుచ్చుకునే ధోరణితోనే భాషలు వృద్ధి జెందుతాయి. ఆంగ్ల భాషకున్న విస్తృత పద సంపద, ఫ్రెంచ్, లాటిన్ లాంటి భాషల సంపర్కం వల్లే వచ్చింది.

'సకల భాషలకు జనని సంస్కృతంబు' అని చాటిన ఛాందసుల వాదన కూడా తమిళుల మూర్ఖ వాదన వంటిదే.కొంత మంది భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం వైదిక సంస్కృతాన్ని,ప్రాకృత భాషలను ఉగ్గడించి కావ్య రచనకు ప్రాచీన సంస్కృతాన్ని తయారు చేశారు.అన్ని ఆర్య భాషలకు మూలమైన వైదిక సంస్కృతం గానీ, ద్రవిడ భాషలకు మూలమైన ఆది ద్రవిడ భాషగానీ ఇప్పుడు వాడుకలో లేవు.

భారత దేశంలో గుర్తించదగ్గ మంది మాట్లాడుతున్న ప్రతి భాషనూ కాపాడడం ఆయా ప్రభుత్వాల కర్తవ్యం. ప్రాచీన భాష హోదా మీద ఖర్చవుతున్న నిధులు సకల భాషల పరిరక్షణార్థం వినియోగించాలి. ఎందుకంటే అనేకమైన లిఖిత రచనలు పునర్ముద్రణ లేక కనుమరుగవుతున్నాయి,ఇంకా కొన్ని తాళపత్రాలు పొత్త రూపము ధరించలేదు.అంతేకాక, వందల సంవత్సరాల జానపద సాహిత్యం మీద పరిశోధన చేసి లిపి బద్ధం చేయవలసిన అవసరం ఉంది. అంతేకాక స్వరాష్ట్రం లో లేని వారికి తమ మాతృ భాష నేర్చుకునే సౌకర్యాలు కల్పించాలి.ఇవి అన్ని భాషల విషయంలో జరగాలి. ఆ భాష కన్నా ఈ భాష గొప్పది లేదా ప్రాచీనమైనది అని తీర్మానించడం 28 రాజ్యాంగం గుర్తించిన భాషలున్న భారతదేశం లాంటి దేశంలో ఆచరణీయ విధానం కాదు.ఈ విధానం వైషమ్యాలకు ఆజ్యం పోస్తుంది.

(నవంబర్ 9, 2019 న ప్రతిలిపి పాఠకులకై వ్రాసినది)

శ్రద్ధ

షిర్డీ సాయి బాబా అనే అవధూత యొక్క భక్తి ఉద్యమం నేడు తెలుగు నేల పై ఉధృతంగా సాగుతుంది. పెక్కు మంది వారిని కేవలం కామితార్ధములు తీర్చే దైవంగా భావించి పూజిస్తున్నారు. కానీ వారు చేసిన బోధనలు గూర్చి తెలుసుకోవడం కూడా భక్తులకు అత్యావశ్యకం. ప్రతి షిర్డీ సాయి బాబా మందిరం గోడల పై రాసి ఉండే రెండు పదాలు శ్రద్ధ మరియు సబూరి. దానిలో మొదటిదైన శ్రద్ధ గురించి విపులీకరించేదే ఈ వ్యాసం:

భగవంతుడు ఉన్నాడనే ప్రగాఢ విశ్వాసాన్ని, ఆయనను ప్రాప్తించుకోవాలనే ఆకాంక్షను శ్రద్ధ అని నిర్వచిస్తారు స్వామి వివేకానంద. శ్రద్ధ అంటే అనుష్ఠానయుత విశ్వాసం. అంటే విశ్వసిస్తున్నామని కేవలం నోటి మాటగా చెప్పడం కాదు; ఆ విశ్వాసాన్ని అనుష్ఠానంలోకి తీసుకురావడం,ఆ విశ్వాస లక్ష్య సాధనకు కృషి సలపడమే శ్రద్ధ.

శ్రద్ధాయత్ పూర్వకః సర్వ పురుషార్ధ సాధన ప్రయోగః చిత్త ప్రసాద ఆస్తిక్య బుద్ధి: - అనగా సమున్నత లక్ష్య సాధనకు చేసే ప్రయత్నాలన్నిటికీ శ్రద్ధ అత్యంత అవశ్యం అంటారు శంకర భగవత్పాదులు ముండకోపనిషత్తు(౨.1.౭) భాష్యంలో. ఏమిటా సమున్నత లక్ష్యం – పరమాత్మను ప్రాప్తించుకోవడమే ఆ లక్ష్యం. దీనినే అద్వైతంలో బ్రహ్మైక్యం అని, విశిష్టాద్వైతంలో విష్ణు సాయిజ్యం అని,భేదాభేద సిద్ధాంతంలో శివైక్యమని అంటారు.

భగవద్గిత 7:3 లో భగవానుడు ఈ విధంగా నుడివినాడు : మనుష్యాణాం సహశ్రేషు కశ్చిద్యదతి సిద్ధయే! యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్వతః! అనగా వేలకొలదీ మనుష్యులలో ఎవడో ఒకరు మాత్రమే నన్ను గూర్చి తెలుసుకొనుటకు ప్రయత్నించును. అట్లు ప్రయత్నించిన వారిలో గూడా ఏ ఒకానొక్కడు మాత్రమే యదార్ధ తత్వమును ఎరుంగును. దీన్ని బట్టి శ్రద్ధ కలిగి యుండడం ఎంత కష్టమైన కార్యమో తెలియవస్తుంది. భగవానుడిని కామితార్ధములు తీర్చుకునుటకై గాక ఆయనను ప్రాప్తించుకోవడం కోసం ధ్యానించాలి,పూజించాలి. అదే నిజమైన శ్రద్ధ. జ్ఞాన,భక్తి,కర్మ,రాజ యోగాల ద్వారా భగవంతున్ని చేరుటకై యత్నించుటే అనుష్ఠానయుత మతము.

అటువంటి శ్రద్ధను గూర్చి స్తుతించేదే ఋగ్వేదంలోని శ్రద్ధా సూక్తం :

“ఓం శ్రద్ధయాగ్ని: సమిద్యతే శ్రద్ధయా హూయతే హవి:” – శ్రద్ధ వలెనే జ్ఞానాగ్ని ప్రజ్వలితమవుతుంది. శ్రద్ధ వలనే మన మనస్సనెడి ఆహుతి భగవంతునికి సమర్పించబడుతుంది.

-ఓం తత్ సత్-

సర్వోదయం అంటే ఏమిటి?

జనవరి 5,1957న జరిగిన 62వ మహాసభలో భారతదేశంలోని సోషలిజం,మహాత్మాగాంధీ సర్వోదయ భావానికి సన్నిహితమైనదైవుండాలి అని నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ దేభర్ గారు విస్పష్టం చేశారు. ఈ సోషలిజంతో మహాత్ముని సర్వోదయ ధర్మం యొక్క ఆర్థిక,సామాజిక లక్ష్యాలను మనం పూర్తిగా సాధించలేకపోవచ్చు.అయినా సరే అది మహాత్ముని భావాల వైపుకు లొంగినదై వుండి తీరాలి అని గూడా ఆయన అన్నారు.

అదే విధంగా ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ అఖిల భారత సర్వోదయ సమ్మేలన్ సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తూ భారతదేశం సర్వోదయ సిద్ధాంతం ప్రాతిపదికగా తన సంఘాన్ని పునర్నిర్మాణం చేసుకోవడంలో విజయం సాధిస్తే ప్రపంచదేశాలలో తనకొక విశిష్ట స్థానం కల్పించుకోగలదని అన్నారు.

సర్వోదయమనగా సమాజంలో ఉన్న అన్ని వర్గాల వారు ఆర్థికంగా,సామాజికంగా మఱియు నైతికంగా పురోగమించడం.

ఈ సర్వోదయ సిద్ధాంతానికి స్ఫూర్తిని గాంధీజీ జాన్ రస్కిన్ అనే ఆంగ్ల రచయితా రచించిన ‘Unto this last’ అనే పొత్తము నుండి గ్రహించారు.

సర్వోదయ సమాజంలో అందరూ నిజాయతీగా కష్టపడి పనిచేసి తన అవసరాలకు కావలసిన ధనాన్ని సంపాదించుకుంటారు.ఆదాయంలో హెచ్చుతగ్గులు వ్యక్తుల సామర్ధ్యం బట్టి వేరువేరుగా ఉండచ్చు,కానీ ఎవ్వరూ పని లేకుండా ఆకలితో అలమటించరు.

పుడమి జనుల అవసరాలకు,ఆశలకు కావలిసినంత ఇస్తుంది,కానీ జనుల యొక్క అత్యాశలను తీర్చలేదు అని గాంధీజీ నిశ్చితాభిప్రాయం.

సర్వోదయ సమాజంలో అధికంగా సంపద కలిగిన మనుషులు వారి దగ్గర ఉన్న అధిక సంపాదకు ధర్మకర్తలుగా వ్యవహరించాలి.అనగా సమాజ ఉన్నతి కోసం ఆ ధనాన్ని వినియోగించాలి. అంటే తన బిడ్డలకు ఏమీ పంచివ్వకుండా దానం చేసేయమని కాదు బాపూజీ ఉద్దేశ్యం. ఉదాహరణకు అధిక సంపద కలిగిన వారు ఆ సంపదతో ఒక సంస్థ స్థాపించి పది మందికి ఉపాధి కల్పించవచ్చు. కానీ ఆ పనిని అతడు ధర్మకర్తృత్వ భావనతో చేయాలిగానీ బూర్జువా మనస్తత్వంతో కాదు.

గాంధీజీ యంత్రాల వినియోగాన్ని కొంత వరకు ఆమోదించారు.కానీ,యంత్రాల వినియోగం మూలంగా ప్రజలు నిరుద్యోగులుగా మారటాన్ని మటుకు వ్యతిరేకించారు.మానవుని ఉన్నతికి యంత్రాలు కచ్చితంగా అవసరమైనప్పుడు,వాటిని తప్పక వినియోగించాలి అని బాపూజీ అన్నారు.ఉదాహరణకు వర్తమాన ప్రపంచంలో నిత్యావసరాలైన మోటార్ వాహనాలు,టి.వి,ఫ్రిజ్,ఫోన్,కంప్యూటర్ లాంటి పరికరాలను చేతి వృత్తుల ద్వారా ఉత్పత్తి

చేయలేం.అటువంటి వస్తువులను ఉత్పత్తి చేయటకు భారీ పరిశ్రమలు అవసరం. అదే సమయంలో భారీ పరిశ్రమలకు సమాంతరంగా కుటీర పరిశ్రమలు,వ్యవసాయంతో కూడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా కాపాడినప్పుడు కొంత పనిశక్తి ఈ రంగాలలో కూడా వినియోగింపబడి నగర ఆర్థిక వ్యవస్థపై భారం తగ్గుతుంది.తద్వారా నిరుద్యోగం తగ్గి జనుల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయి.

హిందూ స్వరాజ్యానికి స్వాతంత్ర్యం,అహింస,స్వదేశి,సర్వోదయం మూల స్తంభాలుగా గాంధీజీ భావించారు.ఉన్నతమైన ఆలోచనలతో కూడిన సాధారణ జీవితం గాంధీజీ సిద్ధాంతం.

సర్వోదయ సిద్ధాంతానికి మూలం గ్రామాభ్యుదయం.కేంద్రీకృత రాజ్యాధికారం లేకుండా,గ్రామసభలకు అధికార వికేంద్రీకరణ జరగాలి.సర్వోదయ సమాజంలో రాజకీయం అధికారం చెలాయించడం కోసం కాదు.అది ప్రజాసేవకై ఒక ఉపకరణం లాంటిది.సర్వోదయ సమాజంలోని ప్రజలు సత్యం,అహింస,స్వార్థత్యాగం,ప్రేమ,అస్తేయాలు ప్రాతిపదికగా జీవిస్తారు.

నియంతృత్వంతో కూడిన కమ్యూనిస్ట్ సమసమాజంలా కాక స్వేచ్ఛ,స్వాతంత్ర్యాలతో కూడిన నిజమైన సామ్యవాదాన్ని ఆశిస్తుంది సర్వోదయ సమాజం.

సర్వోదయ సమాజం వాస్తవిక ప్రపంచంలో సాధ్యపడదు అని కొట్టి పారేయనవసరం లేదు.సర్వోదయాన్ని రెండు విధాలుగా అమలు పరచవచ్చు:-

1. నగరాలు కేంద్రంగా కలిగిన ఆర్థికవ్యవస్థతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరచడం;
2. నగరాల్లోనూ,గ్రామాల్లోనూ గాంధీజీ ప్రవచించిన నైతిక విలువలైన సత్యం,అహింస,స్వార్థతత్యాగం,ప్రేమ,అస్తేయాలను విద్యావ్యవస్థలో భాగంగా చేయడం.

3800 సంవత్సరాల క్రితం బుద్ధుడు ప్రవచించిన బౌద్ధం ఈనాటికీ సార్వజనీన సత్యమే. అదే విధంగా గాంధీజీ సిద్ధాంతాలు కొద్దిపాటి మార్పులతో వర్తమానానికీ,భవిష్యత్తుకు కూడా సరిపోతాయి. భారతదేశపు ఆత్మను బాపూజీ అర్థం చేసుకున్నంతగామరొకరు అర్థం చేసుకోలేదనడం అతిశయోక్తి ఎంత మాత్రంకాదు.